క్లుప్తంగా

వాడపల్లి ఎస్ఐగా హరికృష్ణ



మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లి నూతన ఎస్ఐగా పి.హరికృష్ణ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ రవి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో డీటీసీలో పనిచేస్తున్న హరికృష్ణ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి



షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గుడిపాటి నవీన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దేవాలయ షెడ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరుచుకోవాలని, ఆధ్యాత్మికచింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్ : జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని బీసీ గురుకుల విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఏటీపీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వే బ్రిడ్జిల్లో అధికారుల తనిఖీ



వేబ్రిడ్జిలో తనిఖీ చేస్తున్న అధికారులు

మిర్యాలగూడ : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామ శివారులోగల రైస్ మిల్లుల్లో సోమవారం సాయంత్రం జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో వే బ్రిడ్జి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వే బ్రిడ్జిలో పది టన్నులకు గాను 20కిలోల తేడా ఉండడంతో రూ.75వేల జరిమానా విధించినట్లు తెలిపారు. తూనికల కొలతల విషయంలో తేడాలు ఉంటే వే బ్రిడ్జిలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ధాన్యం సీజన్‌లో వేబ్రిడ్జిలను ఎప్పటికప్పుడు తనిఖీ చేపడ్తామన్నారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

రైస్ మిల్లు యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి

వేములపల్లి : రైస్ మిల్లు యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో ఓ రైతు ఫిర్యాదు చేశాడు. మాడుగులపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన నామిరెడ్డి శ్రీధర్‌రెడ్డి తాను విక్రయించిన ధాన్యంలో వివిధ రకాలుగా కోత విధించి తనను మోసం చేశారని సోమవారం వేములపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తాను స్థానిక మహర్షి రైస్ మిల్లులో అక్టోబర్ 12న రెండు ట్రాక్టర్ల సన్న ధాన్యాన్ని వారు చెప్పిన ధరకు విక్రయించినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన సమయంలో హమాలీలు కాని, గుమస్తాలు కాని తనకు ఎలాంటి సహకారం అందించలేదన్నారు. కాగా తాను ధాన్యం విక్రయించిన డబ్బుల కోసం రైస్‌మిల్లుకు వెళ్లగా హమాలీ ఖర్చు, గుమస్తా రుసుము, సీసీ కటింగ్ అని ఒక శాతం కట్ చేసుకున్నట్లు తెలిపారు. ఇవన్నీ కట్ చేసుకున్న తరువాతనే తనకు రావాల్సిన డబ్బులను బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. తాను విక్రయించిన ధాన్యానికి రావాల్సిన డబ్బులతో పాటు కోత విధించిన డబ్బులు ఇస్తున్నారని, మిల్లర్లు సిండికేట్‌గా మారి దోపిడీకి పాల్పడుతున్నారని రైతు పేర్కొన్నారు. తనను మోసం చేసిన మిల్లు యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తాను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అట్టహాసంగా గురుకుల క్రీడలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



రన్నింగ్ చేస్తున్న విద్యార్థినులు

డిండి : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల పదవ జోనల్‌స్థాయి క్రీడాపోటీలు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో(బాలికలు) అట్టహాసంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అండర్ -14,17, 19 విభాగాల్లో నిర్వహిస్తున్న క్రీడాపోటీలకు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 9 గురుకులాలకు చెందిన 800 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి యంగ్ యూనివర్సిటీని ప్రారంభించారని, క్రీడారంగం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలను రూపొందిస్తుందన్నారు. గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయి శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడల ప్రారంభోత్సవ సందర్భంగా హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులకు విద్యార్థినులు ఘన స్వాగతం పలకడం, నృత్యాలు ప్రదర్శించటం, మార్చ్‌ఫాస్ట్ నిర్వహించిన తీరు పలువురిని ఎంతగానో ఆకట్టుకుంది. మొదటి రోజు రన్నింగ్, కబడ్డీ, షాట్‌పుట్ పోటీల మొదటి మ్యాచ్‌లు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీసీఓ అర్జున్ ప్రసాద్, దేవరకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్మన్ జుమన మాధవరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ వెంకన్న, ఎంఈఓ గోప్యానాయక్, ప్రిన్సిపాల్ శిరీష, జోనల్ క్రీడల ఇంచార్జీ జ్యోతిర్మయి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థినులు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

డిండి: మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న చేప పిల్లలను మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టులో వదిలిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన మత్స్యకారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్డ్ ట్రెనింగ్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జాల్‌తండా, సోమ్లాతండాలో బీటీరోడ్డు పనులకు శంకుస్థాన చేసారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎఫ్‌డీఓ మారయ్య, దేవరకొండ వ్యవసాయ మార్కెట్ కమటీ చెర్మన్ జమున మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, కొర్ర రాంసింగ్, హరికృష్ణ, మత్స్యశాఖా సొసైటీ చెర్మన్ మేకల కాశన్న, గడ్డమీది సాయి,గుర్రం రాములు, బొల్లే శైలేష్, నూకం వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, లక్ష్మణ్, ఖలీం, విజయేందర్‌రెడ్డి, రాంకిరణ్, లక్పతినాయక్, రేఖ్యానాయక్ పాల్గొన్నారు.



డిండి ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



నరసింహ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చింతపల్లి: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎలిమినేటి అలివేలు నరసింహ తల్లి నిరంజన్ అమ్మ ఆదివారం మృతి చెందింది. ఆయన కుటుంబాన్ని సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం,మాజీ ఎంపీపీలుకొండూరు భవాని పవన్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, శత్రజ్ఞ రాజు, సింగిల్ విండో చైర్మన్ ఎల్ వెంకటయ్య, మాజీ కో ఆప్షన్ జహంగీర్, మాజీ ఎంపీటీసీలు సదానందం, కొండల్ యాదవ్,కాసారపు శ్రీనివాస్ మాజీ ఉపసర్పంచ్ సలీం, గోవిందు గిరి,గ్రామ శాఖ అధ్యక్షులు గోవిందు రవి పాల్గొన్నారు.

సన్న ధాన్యం మిల్లులో అమ్మినా బోనస్ ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ : రైస్ మిల్లుల్లో అమ్మిన ప్రతి రైతుకు ప్రభుత్వం రూ.500 బోనస్ అందించాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యాద్గార్‌పల్లి, అవంతీపురం రైస్ మిల్లుల వద్ద ధాన్యం కొనుగోళ్లను ఆయన పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. తేమ శాతం కారణంగా సన్న ధాన్యం రైతులు రైస్ మిల్లుల్లోనే అమ్ముకోవాల్సి పరిస్థితి ఉందని, దీని గురించి జిల్లా మంత్రులు సీఎం రేవంత్‌రెడ్డికి సమగ్రంగా వివరించాలన్నారు. గత వానాకాలం సీజన్‌లో క్వింటాకు రూ.2600 నుంచి రూ.2700 వరకు సన్నధాన్యంకు ధర లభించాయని ఈ సారి రూ.2200కే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది రైతులబంధు, రైతు భరోసా ప్రభుత్వం ఇవ్వలేదని బోనస్ కూడా వర్తింపజేయకపోతే రైతులు అన్యాయమవుతారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఇస్తే రైతులకు కొంత ఉపశమనం లభిస్తుందన్నారు. ఎంతో శ్రమపడి పండించిన రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని, బోనస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్

వేములపల్లి(మాడ్గులపల్లి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంకగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. సోమవారం మాడులపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను వారు పరిశీలించి మాట్లాడారు. మండలంలో సర్వే నెమ్మదిగా సాగుతుందని వేగం పెంచాలని వారు అధికారులను ఆదేశించారు. ఎన్యుమరేటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా తమకు కేటాయించిన ప్రతి ఇంటికి వెళ్లి నిర్దేశించిన కాలమ్స్‌లో ఉన్న ప్రశ్నలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకోని ఫారంలో ఎలాంటి తప్పులు లేకుండా పొందుపరచాలన్నారు. సర్వేపై ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ ప్రజలు సర్వేకు సహకరించేలా కృషి చేయాలన్నారు. సర్వే పనితీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట తహసీల్దార్ పద్మ, స్పెషల్ అధికారి సులోచన, ఆర్ఐ రేణుక తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : నిడమనూరు, త్రిపురారం మండలాల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుల గణన సర్వే కొనసాగుతుంది. సోమవారం త్రిపురారం మండలంలోని పెద్దదేవుల పల్లి, బాబుసాయి పేట గ్రామాల్లో జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి ఆకస్మికంగా పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న సమయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా సూపర్ వైజర్లను ఆరా తీశారు. నిడమనూరు మండలంలోని పలు గ్రామాల్లో నిడమనూరు తహసీల్దార్ కృష్ణయ్య సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి, ఏఎస్ఓ దీప, త్రిపురారం ఎంఈఓ రవి నాయక్, నిడమనూరు ఎంఈఓ లావురి వెంకన్న నాయక్ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

పెద్దవూర : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేను పారదర్శకంగా ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా నింపాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. సోమవారం మండలంలోని పర్వేదుల, ఊట్లపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేసుకునే ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు.



వేములపల్లి : మాడుగులపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్



త్రిపురారం : పెద్దదేవులపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి



పెద్దవూర : సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓ తరి రాములు

ప్రజాభిప్రాయ సేకరణ నిలుపుదల చేయాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలం గణేష్‌పాడు గ్రామంలో పెన్నా సిమెంట్ పరిశ్రమ గనుల విస్తరణ, సున్నపురాయి ఉత్పత్తి పెంపుపై ఈనెల 12న చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణను నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు దామరచర్ల సీపీఐ మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ప్లాంట్ నిర్మాణం కోసం 354 హెక్టార్ల భూమిలో గల సున్నపురాయిని తవ్వి సిమెంట్‌గా మార్చేందుకు కలెక్టర్ ప్రతిపాదించారన్నారు. పెరుగుతున్న కాలుష్యం వల్ల ఆ ప్రాంత ప్రజలు, పశుపక్షాదులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజాభిప్రాయ సేకరణను నిలుపుదల చేసి ప్లాంట్ ఏర్పాటును రద్దు చేయాలని కోరారు.

నెట్‌బాల్ పోటీల్లో టైం స్కూల్ విద్యార్థిని ప్రతిభ



సముక్త

హాలియా : రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో స్థానిక టైం స్కూల్‌కు చెందిన విద్యార్థిని సముక్త ఉత్తమ ప్రతిభను కనబర్చి నల్లగొండ జిల్లా జట్టును రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిపినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ మందా నరేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో నిర్వహించిన బాలికల విభాగం రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని సముక్త నల్ల గొండ జిల్లా జట్టు తరపున పాల్గొని నెట్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు ముఖ్య పాత్ర పోషించిందన్నారు. ఈ సందర్భంగా సముక్తను పాఠశాల ప్రిన్స్‌పాల్ కత్తి కోటిరెడ్డి, పీఈటీ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఐదు రోజుల్లో రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ

● డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ అధికారి పత్యానాయక్

త్రిపురారం : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో. ధాన్యం అమ్ముకున్న రైతులకు ఐదు రోజుల్లో వారి బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ అవుతాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.500 బోనస్ కూడా అందిస్తామని డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ అధికారి పత్యానాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం మురళి తెలిపారు. సోమవారం త్రిపురారం మండలంలో పర్యటించి ప్రాథమిక సహకార సంఘం (పీఎసీఎస్)ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బెజ్జికల్ గ్రామంలో సన్న రకం ధాన్యాన్ని మ్యాచర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పత్యా నాయక్ మాట్లాడుతూ.. కష్టపడి పండించిన ధాన్యాన్ని తొందరపడి అమ్ముకోకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకవచ్చేటప్పుడు 17 మ్యాచర్ ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది సమన్వయంతో వరుస క్రమంలో కాంటాలు నిర్వహించి వెంకటే కేటాయించిన మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో త్రిపురారం పీఏసీఎస్ చైర్మన్ జయరాం నాయక్, డైరెక్టర్లు సైదులు, గాసీరాం, సిబ్బంది సైదయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



బెజ్జికల్‌లో పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పత్యా నాయక్

మద్దతు ధరకు ధాన్యం కొనాలి

● డీఎస్ఓ వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ : మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సూర్యతేజ, ఆర్ఎస్వీ మహర్షి, సూర్య, ఆంజనేయ రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ధర, ఇతర సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో ఫాంబీ నిర్వహించడం లేదని తేలడంతో ప్రతి నెలా రికార్డులు సమర్పించాలని ఆదేశించారు. తక్కువ ధర వేసిన మిల్లులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. తేమ, పొట్టు, తాలు ఉన్నాయని సాకు చెప్పి ధర తగ్గించి రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమన్నారు. కచ్చితంగా ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని సూచించారు. రైతులకు ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ఏ రోజుకారోజు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ధర విషయంలో రైతులకు అన్యాయం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి మిల్లు కొనుగోలు విషయంలో రికార్డులను మెయింటేన్ చేయాలని, నివేదికను ప్రతిరోజు సంబంధిత అధికారులను సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం హరీష్, తహసీల్దార్ హరిబాబు, సివిల్ సప్లయ్ డీటీ జావిద్ తదితరులు పాల్గొన్నారు.



మిల్లుల వద్ద రైతులతో మాట్లాడుతున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

గర్భకోశ వ్యాధి నివారణ మందులు పంపిణీ

హాలియా : పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అనుముల మండలంలోని హజారిగూడెం, హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలికంగా గర్భం దాల్చని పశువులను గుర్తించి వాటికి పరీక్షలు నిర్వహించారు. ఎదలో ఉన్న వాటికి కృతిమ గర్భధారణ చేశారు. అదే విధంగా 50దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కొన్ని పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేశారు. మరికొన్ని పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమనరేందర్ రెడ్డి, కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య, డాక్టర్ మహిపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్ నడ్డి బాలరాజు యాదవ్, కో ఆప్షన్ సభ్యుడు చాపల సైదులు, గోపాల మిత్రలు జానపాటి కోటేష్, అనిల్‌కుమార్, లాలు, రవి పాల్గొన్నారు.



ఇబ్రహీంపేటలో పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మహిపాల్‌రెడ్డి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

హాలియా : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పట్టణంలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం. పవన్ ఉత్తమ ప్రతిభను కనబర్చి నల్లగొండ జిల్లా జట్టును రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ మేడిపల్లి మోహన్ రావు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి, భువనగిరి జిల్లాలోని మాదాపూర్‌లో ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి పవన్ నల్లగొండ జిల్లా జట్టు తరపున పాల్గొని కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి పవన్‌ను పాఠశాల ప్రిన్స్‌పాల్ రవీందర్ యాదవ్, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థి పవన్‌ను అభినందిస్తున్న పీఈటీ ఆవుల చంద్రశేఖర్

పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలో పట్టపగలు ఆదివారం మాజీ సింగిల్‌విండో చైర్మన్ ఆవుల వెంకన్న ఇంట్లో దొంగలు పడి లక్షా 92వేల నగదు, 3 తులాల బంగారం చోరీ చేసినట్లు ఎస్ఐ పి.మధు తెలిపారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులందరూ బందువుల ఇంట్లో కార్యానికి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లి రాత్రి పదిగంటలకు రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. మిర్చి పంట పెట్టుబడులకు బంధువుల వద్ద రెండు లక్షల నగదు అప్పు తీసుకుని ఎనిమిది వేల రూపాయలు కూలీల ఖర్చులకు ఇచ్చి బీరువాలో దాచిన లక్షా 92 వేలు దొంగలు దోచుకున్నారు. మూడు తులాల బంగారాన్ని దొంగలు చోరీ చేశారు. బాధితుడిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నమే ఎరడ్లగూడెంలో రైతు ఇంట్లో పట్టపగలే దొంగలు పడి లక్ష నగదు, అరతులం బంగారం దోచుకుని వెళ్లిన సంగతి విధితమే. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్న సమయం కావడంతో ఇంట్లోని వారంతా వ్యవసాయ పనులకు వెళ్లగా దొంగలు పడుతుండటం ఆందోళనకు గురిచేస్తుంది.

మహాయజ్ఞం కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న యువజన సంఘం సభ్యులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని స్థానిక చౌరాస్తా వద్ద గల శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం శ్రీ హనుమాన శక్తి జాగరణ యువజన విభాగం ఆధ్వర్యంలో రామ తారకై మహాయజ్ఞ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈనెల 16న హనుమాన్ గాయత్రి శ్రీ రామ తారక మహాయజ్ఞ విఘ్నేశ్వర పూజ ఆంజనేయస్వామి పంచామృత అభిషేకం, అలంకరణ, అవాహిత దేవత అష్టోత్తర పుష్పార్చన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ గురుస్వామి బత్తుల పరమేష్, అయ్యప్ప గురుస్వామి చిట్టెడు ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కమిటి కార్యవర్గ సభ్యులు బూడిద వెంకటేష్‌యాదవ్, నీలా విజయ్, ఆలయ పూజారులు గణపతిశర్మ, సదాశివశర్మ పాల్గొన్నారు.

కార్తీక మాసం ప్రత్యేక పూజలు

కార్తీక మాసం పురస్కరించుకొని కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తా వద్ద ఉన్న శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు కంచర్ల వెంకట్‌రెడ్డి, తడకమళ్ల శ్రీనివాసులు, పూజారులు పాల సదాశివశర్మ, గణపతిశర్మ, ఆలయ కార్యదర్శి సభ్యులు బూడిద వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

పెద్దఅడిశర్లపల్లి : విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందిన సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పెద్దగుమ్మడం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన రమణంపల్లి వెంకటయ్య, బొడ్డుపల్లి ముత్యాలమ్మ, నాగేష్‌లకు చెందిన మూడు గేదెలు గ్రామ శివారులోకి మేతకు వెళ్లి మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెల మృతితో ఆర్థికంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



వైశాలి

మిర్యాలగూడ టౌన్ : డిసెంబరు 1నుంచి 6వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు దామరచర్ల మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియేట్ చదువుతున్న నూకల వైశాలి ఎన్నికైంది. అక్టోబర్‌లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన జరిగిన జూనియర్ తెలంగాణ ఖోఖో టోర్నమెంట్‌లో ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికై నట్లు పాఠశాల, కళాశాల అధ్యపకులు సోమవారం తెలిపారు. నూకల వైశ్యాలి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై అధ్యపకులు, దామరచర్ల మండల ప్రజలు అభినందించారు.

దేవరకొండ జేఏసీ చెర్మన్‌గా పర్వతాలు

డిండి : ముదిరాజ్ సంఘం దేవరకొండ అసెంబ్లీ జేఏసీ చెర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన కటికర్ల పర్వతాలు నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర జేఏసీ చెర్మన్ పోలం లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల జేఏసీ చెర్మన్‌గా బల్ముల శిర్పతయ్య, పట్టణ అధ్యక్షుడిగా బల్మూరి లక్ష్మయ్యకు నియామక పత్రాలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.